

చారిత్రక నాటక పితామహుడు 'కోలాచలం'

ప్రజాశక్తి- కడప అర్బన్

చారిత్రక నాటక రచనలతో ఆంధ్ర చారిత్రక నాటక పితామహులు కోలాచలం శ్రీనివాసరావని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. కోలాచలం వారి172 వ జయంతిని పురస్కరించుకుని గురువారం రచయితల సంఘం వారు కడప రాజీవ్ కల్చరల్ క్లబ్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ కోలాచలం చారిత్రక నాటకాలకు ఆద్యుడే కాకుండా తెలుగు నేలలో తొలి శాశ్వత ప్రదర్శనశాలను నిర్మించిన రంగస్థల నిర్మాతని పేర్కొన్నారు. దాదాపు 30 నాటకాలు రచించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 'మధురకవి' డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు సత్యనారాయణ, బ్యాంక్ గంగయ్య, మందల చిన్న చెన్నయ్య, మురళి, బాల ఓబయ్య మొదలైన ప్రసిద్ధ రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

జ్యోతి క్షేత్రంలో ఎలాంటి కూల్చివేతలు ఉండవు

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



జ్యోతి క్షేత్రంలో పర్యటిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-కాశినాయన

జ్యోతి క్షేత్రంలో ఎలాంటి కూల్చివేతలు లేకుండా చూస్తానని, నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం ఆయన జ్యోతి క్షేత్రాన్ని సందర్శించి అక్కడ జిల్లా అటవీశాఖ అధికారులు కూల్చిన భవనాలను పరిశీలించారు. జ్యోతి క్షేత్రమంతా కలియ తిరిగారు. అటవీ శాఖ అధికారులు కూల్చిన భవనాలు పరిశీలించారు. అన్నదాన కార్యక్రమం ఏ విధంగా నిర్వహిస్తున్నారని, ఆర్థిక సాయం ఎలా వస్తుందని ఆలయ పూజారి జీరయ్యను అడిగి తెలుసుకున్నారు. నరసింహస్వామి బిందెలను చూసి అక్కడి స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ . ఇక నుండి జ్యోతి క్షేత్రానికి న్యాయమే జరుగుతుందని చెప్పారు. ఢిల్లీలో కాశినాయన జ్యోతి క్షేత్రం గురించి చర్చ జరిగిందని, అక్కడ కూడా సానుకూల స్పందన వచ్చిందని తెలిపారు. బస్సు యథావిధిగా కొనసాగుతుందని, ఇక నుంచి ఇబ్బందులు ఉండకపోవచ్చు అని అన్నారు ఆయన వెంట బద్వేల్ ఆర్డిఒ చంద్రమోహన్ తహశీల్దార్ వెంకటసుబ్బయ్య, ఆర్ఐ, పోరుమామిళ్ల సిఐ శ్రీనివాసులు, పోలీసులు ఉన్నారు.

భవనాలను కూల్చడం బాధాకరం : ఎంపీ

మండల పరిధిలోని కాశీనాయన జ్యోతి క్షేత్రంలో ఉన్న భవనాలను అటవీశాఖ అధికారులు కూల్చివేయడం చాలా బాధాకరమని కడప ఎంపీ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల అటవీశాఖ అధికారులు భవనాలను కూల్చి వేస్తున్న విషయం తెలుసుకున్న ఎంపీ గురువారం కాశినాయన జ్యోతి క్షేత్రాన్ని సందర్శించారు. కూల్చివేసిన భవనాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జ్యోతి క్షేత్రంలో జరుగుతున్న కూల్చివేతలు తమకు తెలియదని, అటవీశాఖ అధికారులే చేశారని కూటమి పెద్దలు చెప్పడం విడ్డూరంగా ఉందని వాపోయారు. గత సంవత్సరం డిసెంబర్, ఈ సంవత్సరం జనవరిలలో ప్రత్యేక సిఎస్ ద్వారా కడప కలెక్టర్కు జ్యోతి క్షేత్రంలో అక్రమ కట్టడాలున్నాయని, వాటిని తొలగించాలని జీవో జారీ చేసింది ప్రభుత్వం కాదా అని పేర్కొన్నారు. కలెక్టర్ మళ్లీ అటవీశాఖ రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ అధికారులకు ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చి కాశినాయన జ్యోతి క్షేత్రంలో అక్రమ కట్టడాలున్నాయని, వాటిని కూల దోయమని చెప్పటం నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. కూటమి పెద్దలు ఆలయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి తెచ్చి ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని వారు కోరారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు ఆలయం నిర్మాణం కోసం 9, దారికి మరో మూడు హెక్టార్లకు అనుమతి కావాలని ఢిల్లీ వరకు వెళ్లామని పేర్కొన్నారు. అక్కడ ఫైలు ఉండని తమ ప్రయత్నం పూర్తిగా చేశామన్నారు. ఇప్పటికైనా కూటమి పెద్దలు కాశి నాయన భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా ఆలయం నిర్మాణానికి అనుమతులు తేవాలన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ డి.సి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి ఉన్నారు.



కూల్చిన భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ అవినాష్రెడ్డి, వైసిపి నాయకులు

పకడ్బందీగా 'పది' పరీక్షలు : కలెక్టర్

ప్రజాశక్తి- కడప అర్బన్

ఈ నెల 17 నుంచి 31వ వరకు పదవ తరగతి పరీక్షలు పకడ్బందీ, భద్రతతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ హాల్లో పదవ తరగతి పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో 161 పరీక్షా కేంద్రాలలో 14,330 మంది బాలురు, 13,470 మంది బాలికలు మొత్తం 27,800 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ భద్రతను కల్పించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులు, ఇన్విజిలెటర్స్ , ఇతర ఉన్నత అధికారులతో సహా ఇతర సిబ్బంది ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు వెంట తీసుకువెళ్లారాదన్నారు. పోలీస్ సిబ్బంది ముందస్తుగానే తనిఖీ చేయాలన్నారు. ఎక్కడ మాస్ కాపీయింగ్కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలన్నారు. అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫాన్స్, ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల కు అంతరాయం కలుగకుండా ఆర్టిసి బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ పరీక్షా కేంద్రాల వద్ద ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పోస్టల్ శాఖవారు పరీక్షా పత్రాలను పరీక్షా కేంద్రాలకు భద్రత తో అందించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో జెసి అదితిసింగ్, కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డిఒలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, చిన్నయ్య, సాయిశ్రీ, తహశీల్దార్లు, విద్యా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మొల్ల' రామాయణం రమణీయం

సరళమైన తెలుగు భాషలో రామాయణం రచించి సమాజానికి అందించిన గొప్ప కవియత్రి మొల్లమాంబ అని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన శ్రీ మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సాహితీవేత్త నరాల రామారెడ్డి, మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు డాక్టర్ విద్వాన్ గానుగపెంట హనుమంత రావు హాజరయ్యారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణ మహా గ్రంథాన్ని పలువురు వివిధ భాషలలో రచించారని చెప్పారు. వాల్మీకి లాంటి మహనీయులు రచించిన రామాయణ గ్రంథాలను ఆధారం చేసుకుని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే తెలుగు భాషలో మొల్ల రామాయణాన్ని సరళంగా రాయడం గర్వించదగ్గ విషయమన్నారు. బద్వేలు వద్ద గల గోపవరం గ్రామానికి చెందిన మొల్ల రామాయణాన్ని అతి తక్కువ పద్య గద్యాలతో అత్యంత సులువమైన శైలిలో తనదైన ముద్రతో రచించి నాటి పండిత పామరుల ప్రశంసలు పొందారన్నారు. **చాపాడు(మైదుకూరు) :** కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా మైదుకూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు కవయిత్రి మొల్ల చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి మాట్లాడుతూ కవుల గడపగా పేరొందిన కడప జిల్లా బద్వేలు దగ్గర గోపవరంలో కవయిత్రి మొల్ల జన్మించడం జిల్లా ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిసి సెల్ అధ్యక్షులు నేట్లపల్లి శివరామ్, వైసిపి నాయకులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, జడ్పిటిసి సుబ్బారెడ్డి, బిసి నాయకులు ఓబయ్య, బిసి సెల్ జిల్లా కార్యదర్శి బతల సుబ్బారాయుడు, వైస్ చైర్మన్ మూలే భరత్రెడ్డి, వైస్ చైర్మన్ షరీఫ్, ఎ.సి.కె. రమణ, సుధాకర్, పిల్లి నాగయ్య, భూమిరెడ్డి సుబ్బారాయుడు, వెంకట సుబ్బన్న రఘురామయ్య,వైసీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

జడ్పి బడ్జెట్ అంచనాలు షురూ!

- రూ.253.26 కోట్ల ప్రతిపాదన

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లా పరిషత్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.253, 26,55,903 బడ్జెట్ అంచనాలు ప్రతిపాదించారు. రూ.179,53,52,813 మేరకు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సర రివైజ్డ్ ఎస్టిమేట్స్, 2022-23 ఆర్థిక సంవత్సర వాస్తవ అంచనాలను బేరీజు వేసుకుని అదనంగా 15 శాతం నిధులను జతపరిచి పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్కు పంపించనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022-23, 2023-24, 2024-25 వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాల్లో లభించిన ఆదాయం, అభివృద్ధి వ్యయాల వివరాలను సైతం పేర్కొన్నారు. జిల్లా పరిషత్ జనరల్ ఫండ్స్ నుంచి 15 శాతం నిధులను షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి, ఆరు శాతం షెడ్యూల్డ్ ట్రైబ్స్, 15 శాతం స్త్రీ, శిశుసంక్షేమ పథకాల అభివృద్ధి పనులకు ఖర్చు చేయనున్నట్లు తెలుస్తోంది.

సేవాగుణం కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవా గుణం కల్గి ఉండాలని హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం యువ అధికారి సైదానాయక్ పేరేక్కన్నారు. జాతీయ సేవా పథకం ప్రాంతీయ సంచాలకులు హైదరాబాద్ వారి ఆదేశానుసారం యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టిసి బస్టాండ్లో 'ఒకరోజు సామూహిక పరిశుభ్రతా కార్యక్రమం' నిర్వహించారు. నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 200 మంది బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేశారు. అక్కడ ఉండే 150 కిలోల ప్లాస్టిక్ పేపర్లు, చెత్తను సేకరించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు విచ్చేసి సైదానాయక్ మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవాగుణం కలిగి ఉండాలని తెలిపారు. వారు నిర్వర్తించాల్సిన విధులను గురించి వివరించారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛతను పాటించాలన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రి శాఖ సహకారంతో ప్రతి ఏటా ఒక బహిరంగ ప్రాంతంలో సామూహిక స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వర్తిస్తున్నామని చెప్పారు. యువత ద్వారానే ఏదైనా సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు విజయ్కుమార్, అనంతలక్ష్మి, శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

రశీదులు తప్పనిసరిగా పొందాలి

- ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రవీంద్రనాథ్

వినియోగదారుడు కొనే వస్తువులు లేదా సేవలకు రశీదులు తప్పనిసరిగా పొందాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. గురువారం కళాశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కడప లీగల్ మెట్రాలజీ శాఖ ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు వస్తువులు కొనేముందు వాటి ధర, పరిమాణం, తయారీ తేదీ, తయారీ కంపెనీ అడ్రస్ వంటి వాటిని సరిచూసుకోవాలని అన్నారు. ఉప ప్రధాన ఆచార్యులు డాక్టర్.ఎం. రమేష్ మాట్లాడుతూ వినియోగదారుడు వస్తువులు, సేవల కొనుగోలు విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. డాక్టర్ మధుసూదన, వినియోగదారుల ఫోరం కృష్ణవేణి మాట్లాడుతూ బస్టాండ్, రైల్వే స్టేషన్లు, సినిమా థియేటర్లలో వస్తువులను ఎమ్మార్పీ ధరలకు కొనుగోలు చేయాలని అన్నారు. ఎన్సిసి అధికారి కెప్టెన్. డాక్టర్. నీలయ్య మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేసినప్పుడు వాటికి ఉన్న గ్యారెంటీలు, వారంటీలపై అవగాహన ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు రెడ్డిబాషా, రాధిక, లావణ్య, ఆర్థిక శాఖ విభాగ అధిపతి, అధ్యాపకులు డాక్టర్ విజయకుమార్, శివరాం, చెంచు బాబు, గయాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలతో బాధ్యత పెంపు

ప్రజాశక్తి - కడప : ప్రోత్సాహకాలను అందించడం ద్వారా విద్యార్థులలో బాధ్యతను పెంపొందించవచ్చునని ప్రధాన వక్త డాక్టర్ వై. సావిత్రి అన్నారు. గురువారం కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో పిఎంశ్రీ సదస్సులో భాగంగా ఒకరోజు కార్యశాల నిర్వహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, ఉష్ణోగ్రతలు, గ్లోబల్ వార్మింగ్, గ్రీన్ హౌస్, గాసెస్, కార్బన్ ఎమిషన్, రెన్యువల్ ఎనర్జీ రిసోర్సెస్ , మొక్కలు నాటడం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థి దశ నుంచే సహజ వనరుల వినియోగాన్ని అలాగే పాఠశాలల్లో పచ్చదనాన్ని నింపడానికి విద్యార్థులకు వివిధ రకాల ప్రోత్సాహకాలను అందజేయడం ద్వారా వారిలో బాధ్యతను పెంపొందించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమ ప్రారంభంలో ప్రిన్సిపల్ మునిష్ మీనా మాట్లాడుతూ విద్యార్థులలో ప్రారంభ దశ నుంచి వాతావరణంలో జరిగే మార్పులు, జీవజాతి ఎదుర్కొంటున్న పరిణామాలు, మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకోవడం ద్వారా వాతావరణ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చని చెప్పారు.

నిరుద్యోగ వ్యతిరేక సదస్సును

జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - అట్లూరు

ఈనెల 14న నిర్వహించబోయే నిరుద్యోగ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి. చాంద్బాషా, అట్లూరు మండల కార్యదర్శి రమణయ్య పిలుపునిచ్చారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాలను గురువారం అట్లూరు సిపిఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కాయ కష్టం చేసే యువతీ,యువకులు పనులు లేక వలసలు పోతున్నారని చెప్పారు. చదువుకున్న యువత ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లేక నిరాశకు లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల 38 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని ఎన్నికల వాగ్దానం చేసి మాట తప్పారని వాపోయారు. కడప నగరం బాలాజీ నగర్లో ఉన్న యుటిఎఫ్ కార్యాలయంలో సదస్సు ఉంటుందని, ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్, జిల్లా కార్యదర్శి జి,చంద్రశేఖర్ హాజరవుతారన్నారు. జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతి, యువకులు, మేధావులు, ప్రజా సంఘ నాయకులు, అభ్యుదయ వాదులు, ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రవిచంద్ర ,గోపయ్య, అట్లూరు గోపయ్య, లతా, విజయమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

ప్రజాశక్తి- కాశినాయన : త్వరలో జరగబోయే 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఎస్టియు మండల శాఖ అధ్యక్షులు రవీంద్రబాబు పేర్కొన్నారు గురువారం ఎస్టియు ఆధ్వర్యంలో కోడిగుడ్లపాడు పదవ తరగతి విద్యార్థులకు, వరికుంట్ల కస్తూర్బా విద్యార్థులకు దాదాపు 60 మందికి పరీక్ష సామగ్రిని ఎస్టియు సీనియర్ నాయకులు వాకా చంద్రశేఖర్ జ్యోతి మహేష్ సహకారంతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి క్రమశిక్షణతో చదివి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, మేర్సెమాలినీ, సిపిఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం, నారాయణ,రామకృష్ణారెడ్డి, రాజగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షల కిట్ పంపిణీ

ప్రజాశక్తి - బద్వేలు : పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు గురువారం బద్వేల్ నియోజకవర్గం మాజీ యువజన విభాగం అధ్యక్షులు కామిరెడ్డి సుధాకర్రెడ్డి సహకారంతో బద్వేల్ నియోజకవర్గం అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి చేతులమీదుగా పరీక్షల కిట్ను పంపణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో చదువుకున్నవి పరీక్షలలో రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులై ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాజులపల్లె వెంకటసుబ్బారెడ్డి, గాజులపల్లె జయ సుబ్బారెడ్డి, గోపాల్ రెడ్డి,వెంకటసుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, గోనుగుంట్ల సుబ్బారెడ్డి, జమ్మన శేఖర్ రెడ్డి ప్రతాపు రెడ్డి,వంకెల రామ సుబ్బారెడ్డి,మండల కోఆప్షన్ నెంబర్ అల్లా, సుఖేష్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

వైసిపి అధికారంలోకి రావడం ఖాయం

- వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్రెడ్డి

ప్రజాశక్తి - కడప



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్రెడ్డి

పోరాటాల నుండి పుట్టింది వైసిపి అని, తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లు అధికారంలో లేకపోయినా పార్టీని వైఎస్ జగన్ నిలబెట్టడమే చాలా గొప్ప విషయం అన్నారు. చిరంజీవి రెండేళ్లకే ప్రజారాజ్యం పార్టీ అమ్ముకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2019 జగన్మోహన్రెడ్డి ప్రభంజనం సృష్టించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారన్నారు. మేనిఫెస్టోను ఖురాన్, భగవద్గీత, బైబిల్ గా భావించిన పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఇంటి వద్దకు సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు. **చెన్నూరు:** నాలుగేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చే పార్టీ వైసిపి అని మండల యువజన విభాగ అధ్యక్షులు పేరు సాముల నిత్య పూజయ్య, ఉపాధ్యక్షులు కార్తీక్ రెడ్డి అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ 15 ఏళ్లకు ముందు పార్టీ పుట్టిందని ఇప్పటికి ఏ మాత్రం ఆదరణ తగ్గలేదని చెప్పారు. తొమ్మిది సంవత్సరాలు అధికారం లేకపోయినా ఒత్తిళ్లకు తట్టుకొని నిలబడగలిగిన గొప్ప నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ ఇన్ఛార్జి రామాంజనేయులురెడ్డి ఆధ్వర్యంలో మండలంలో వైసిపిని బలపరుస్తామని యువజన విభాగంలో యువకులతో కలిసి ముందుకు నడిపిస్తామని చెప్పారు.

కెపాసిటర్లు సరైన పద్ధతిలో వాడితే

విద్యుత్ బిల్లులు తగ్గించొచ్చు : ఎస్ఇ

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ రమణ

అధికలోడు వినియోగించే వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులు కెపాసిటర్లను సరైన పద్ధతిలో వాడితే విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గించుకోవచ్చని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్. రమణ తెలిపారు. విద్యుత్ భవన్లోని తన ఛాంబర్లో మీడియాతో ఆయన మాట్లాడారు. విద్యుత్ లోడ్ ఆన్ అయినప్పుడు మాత్రమే కెపాసిటర్లు ఆన్ కావాలి, లోడుకు సరిపోయే కెపాసిటర్స్ను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి అని అన్నారు. దీనివల్ల విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని తెలియజేశారు. కెపాసిటర్ల సామర్థ్యం విద్యుత్ లోడు కు 65 శాతం నుంచి 75 శాతం వరకు ఏర్పాటు చేసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి అన్నారు. ఐఎస్ఐ మార్క్ ఉన్న విద్యుత్ పరికరాలను వాడడం వల్ల ప్రయో జనాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ట్రాన్స్ఫార్మర్లు, కేబుల్లు, ఇతర విద్యుత్ మౌలిక సదుపాయాలపై భారం తగ్గి తక్కువ శక్తి నష్టాలకు దోహద పడుతుంది అని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ను బలోపేత చేసి సమర్థ వంతమైన విద్యుత్ పంపిణీ చేయడానికి సహాయపడతాయన్నారు. విద్యుత్ వినియోగదారులు కెపాసిటర్లను సరైన పద్ధతిలో ఉపయోగించి విద్యుత్ బిల్లులను, పరికరాల నిర్వహణ ఖర్చులను తగ్గించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోరుబాట సిగ్గుచేటు : టిడిపి

ప్రజాశక్తి- కమలాపురం టౌన్ : వైసిపి యువత పోరు నిర్వహించడం సిగ్గుచేటని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పుత్తా ఎల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పోరుబాట అంటూ రోడ్డు ఎక్కడం సిగ్గుచేటని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో యువతకు ఏమి చేశారని ప్రశ్నించారు. జాబ్ కేలండర్ అంటూ మోసం చేశారని విమర్శించారు. కనీసం సొంత జిల్లాలో కొప్పర్తి కారిడార్లో ఎంత నిధులు తీసుకొచ్చారో చెప్పాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, లోకేశ్వర్ రెడ్డి ,వెంకటేష్ పాల్గొన్నారు.

పి4 సర్వేతో ప్రతి ఇంటికీ అభివృద్ధి

ప్రజాశక్తి - కడప : పి4 సర్వేతో ప్రతి ఇంటికీ అభివృద్ధి, ప్రతిజీవితానికి ప్రగతి చేకూరుతుందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో స్వర్ణాంధ్ర-2047 లో భాగంగా పి4 సర్వే, ప్రజా అభిప్రాయాలపై ఎస్పి అశోక్కుమార్తో కలసి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- 2047లో భాగంగా పబ్లిక్, ప్రజలు, దాతలు పార్టనర్షిప్తో అట్టడుగునున్న 20 శాతం పేదలను, అత్యున్నతంగా ఉన్న 10 శాతం సంపన్నులు ద్వారా అభివృద్ధి చేయడం పి4 ముఖ్య ఉద్దేశమని చెప్పారు. వచ్చే ఐదేళ్లల్లో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం 'జీరో పావర్టీ - పి4 పాలసీ' అమలుకు కృషి చేస్తోందన్నారు. వెనుకబడిన కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు ఈ పాలసీ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు ఆర్డిఒలు ఆర్డిఒ జాన్ ఇర్విన్, సాయిశ్రీ, సిపిఒఅజరతయ్య, జడ్పి సిఇఒ ఓబులమ్మ, డిఆర్డిఎ పీడీ ఆనంద్ నాయక్, డిపిఒ రాజ్యలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, కమిషనర్లు, బ్యాంక్ అధికారులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. **అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు..** జిల్లాలో వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అందుకు సంబంధించి పనుల అనుమతులను జాప్యం చేయక సంబంధిత అధికారులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాల్లో జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, రెవెన్యూ సదస్సులు, గ్రామ సభలు, పౌర సరఫరాల పంపిణీ తదితరులపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్తో కలసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత తహసీల్దార్ వద్దకు వచ్చిన దరఖాస్తును రెండు రోజుల్లో క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత ఆర్డిఒలకు పంపాలని, వారు 24 గంటల్లో పరిశీలించి నివేదిక తయారు చేసి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. సకాలంలో అనుమతులు ఇవ్వక జాప్యం చేసి అక్రమ మైనింగ్కు ఆస్కారం ఇవ్వవద్దన్నారు. గ్రామస్తులు, ప్రజలు, మరి ఎవరైనా పనులలో అభ్యంతరాలు చేస్తే వారితో మాట్లాడి లోటుపాట్లను, సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో కడప,బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డిఒలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, చిన్నయ్య, సాయిశ్రీ, మైన్స్ శాఖ డిడి సూర్యచంద్రరావు, ఇరిగేషన్ ఎస్ఇ వెంకట్రామయ్య, తహశీల్దార్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం..

అసంపూర్తిగా నిలిచిన గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ఎస్సి, ఎస్టి, బిసి లబ్ధిదారులకు ప్రభుత్వం ఆదనపు ఆర్థిక సాయం అందజేస్తుందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఎస్సి, బిసిలకు రూ. 50 వేలు, ఎస్టిలకు రూ. 75 వేల చొప్పున దాదాపు 25 వేలమంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, గృహ నిర్మాణ ఇంజనీరింగ్ సిబ్బంది ఈనెల 15 నుంచి 23 వరకు ఇళ్ల నిర్మాణాల వద్దకు వెళ్లి యాప్ ద్వారా ఫొటోలు తీసి హౌసింగ్ వెబ్సైట్లో అప్ లోడ్ చేస్తారని తెలిపారు.

గోడౌన్లు, ట్రాన్స్పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్పి ఇ.జి. అశోక్ కుమార్ ఆదేశాల మేరకు నగరంలోని ట్రాన్స్పోర్టు కార్యాలయాలు, గోడౌన్లలో గురువారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను పూర్తిగా కట్టడి చేసే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా జరగకుండా ఎస్పి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నగరంలోని ఆర్టిసి బస్టాండ్, మేకల దొడ్డి, తదితర ప్రాంతాల్లోని ట్రాన్స్ పోర్ట్ కార్యాలయాలు, గోడౌన్లు, ప్రముఖ ఆన్ లైన్ మార్కెటింగ్ కంపెనీల గోడౌన్లలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణాకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్శిళ్లలో ఎక్కడైనా గంజాయి ఆనవాళ్లను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీల్లో ఫ్యాక్షన్ జోన్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సిఐ ఈదురు బాష పేర్కొన్నారు. గురువారం అక్కాయపల్లిలోని సాయి కృప నర్సింగ్ స్కూల్ విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని చెప్పారు. బాగా చదువుకుని సమాజానికి, దేశానికి సేవ చేయాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆశల్ని, ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ గడువు పెంపు

ప్రజాశక్తి - కడప అర్బన్

భారత ప్రభుత్వ యువజన, క్రీడా వ్యవహారాల శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆదేశాల మేరకు యూత్ పార్లమెంటు ఉప న్యాసాల పోటీలలో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 16 వరకు గడువు పొడిగింపు చేసినట్లు జిల్లా యువజన అధికారి మణికంఠ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలలో పాల్గొని యువత వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశం పైన ఉపన్యాసాలు ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చాటిన వారు దేశస్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. అన్నమయ్య, కడప జిల్లా పరిధిలోని 18 నుంచి 25 సంవత్సరాలు వయసుగల యువత రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ఈనెల 15 న కె ఎస్ ఆర్ ఎమ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించాల్సిన ఉపన్యాసాల పోటీలు, రిజిస్ట్రేషన్ గడువు పెంపు కారణంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న యువత ఈ మార్పును గమనించాలని తెలిపారు.

ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు ఉచిత డిఎస్సి కోచింగ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న మెగా డిఎస్సి పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్ పోర్టల్ లోని విజ్ఞాన భూమిలో వెబ్ ఆప్షన్ సర్వీసును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వెబ్ ఆప్షన్కు ఈనెల 15 చివరి తేదీ అని తెలిపారు. ఇప్పటికే వెయ్యి మంది తమ వెబ్ ఆప్షన్లు పూర్తి చేశారని పేర్కొన్నారు. ఉచిత శిక్షణ కోసం అభ్యర్థుల జాబితా వెబ్ పోర్టల్లో ప్రదర్శిస్తామని తెలిపారు.

అంధుల పాఠశాలలో అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్



అన్నదానం చేస్తున్న గౌస్పీర్

నగరంలో శంకరాపురంలో ఉన్న అంధుల పాఠశాలలో కాంగ్రెస్ మాజీ పార్ల మెంటరీ ఇన్ఛార్జి సయ్యద్ గౌస్పీర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంధులు, మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ గౌస్ పీర్ మీడియాతో మాట్లాడుతూ విజయ జ్యోతి పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని చెప్పారు. మరిన్ని పుట్టినరోజులు భవిష్యత్తులో చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర కాంగ్రెస్ అధ్యక్షులు అఫ్జల్ఖాన్, కో- ఆర్డినేటర్ బండి జకరయ్య హాజరయ్యారు.

బస్సును అడ్డుకున్న అటవీ అధికారులు

ప్రజాశక్తి-కాశినాయన : జ్యోతి క్షేత్రానికి గురువారం ఆర్టిసి బస్సు ప్రయాణికులతో బయలుదేరుతుండగా చెక్పోస్టు వద్ద అటవీశాఖాధికారులు అడ్డుకున్నారు. దీంతో ప్రయాణికులకు, అధికారులకు కొద్దిసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. అలాగే ఇటుకలతో లోడ్తో వెళ్తున్న ట్రాక్టర్ను కూడా ఫారెస్టు అధికారులు కొద్దిసేపు నిలిపేశారు. చివరకు బస్సు, ఇటుకల లోడ్ ట్రాక్టర్ జ్యోతి క్షేత్రానికి వెళ్లాయి. ఇక నుంచి రోజూ యథావిధిగా బస్సు తిరుగుతాయని కమిటీ వారు తెలిపారు



దీక్షలో కూర్చున్న పశువైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

విద్యార్థుల దీక్షలకు తల్లిదండ్రుల మద్దతు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తమకు స్టయిఫండ్ పెంచాలని పశు వైద్య విద్యార్థులు 39 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు వారి తల్లిదండ్రులు గురువారం మద్దతిచ్చారు. తల్లిదండ్రులు కూడా దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ వెటర్నరీ వైద్య కళాశాల విద్యార్థులకు స్టయిఫండ్ పెంచకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా నాలుగు కళాశాలల్లో ఉన్న వేలాది మంది జూనియర్ డాక్టర్స్ ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే అనేక రీతుల్లో ప్రభుత్వాన్ని కోరామన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. ఇప్పటి నుండి సమ్మె ఉధృతం చేస్తున్నామని హెచ్చరించారు. వివిధ వర్గాలు, రంగాల ప్రజలను కలుపుకొని రోడ్డు మీదకు వచ్చే సమయం వచ్చిందన్నారు.



తీగలు చోరీకి గురి కావడంతో నిరుపయోగంగా ఉన్న మోటర్

వ్యవసాయ మోటర్ల తీగలు చోరీ

ప్రజాశక్తి - ఖాజీపేట

ఆరుగాలం కష్టించి పంటలను సాగు చేసే రైతులకు కూడా దొంగల బెడద తప్పడం లేదు. వ్యవసాయంలో కష్టనష్టాలు ఎదురవుతున్నా వ్యవసాయం చేయక మానడం లేదు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, అరకొరగా దిగుబడులు రావడంతో నష్టాలు వస్తున్నాయి. దీనికితోడు రైతులకు దొంగల బెడదతో మరింత నష్టం వస్తోంది. రాత్రి వేళల్లో దొంగలు వ్యవసాయ మోటర్లకు సంబంధించిన వైర్లను కత్తిరించి తీసుకెళుతున్నారు. పెట్టుబడులు కూడా రాని స్థితిలో దొంగల బెడద రైతులను మరింత ఆర్థికంగా నష్టపరుస్తున్నాయి. గురువారం మండల పరిధిలోని చెముళ్లపల్లె గ్రామానికి చెందిన రైతు రెడ్యం నారాయణరెడ్డికి చెందిన వ్యవసాయ మోటర్‌కు సంబంధించిన తీగలను దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. కొంత కాలంగా ఇలాంటి ఘటనలు ఎక్కువగా చోటు చేసుకుం టున్నాయని రైతులు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు గస్తీని పెంచి చోరీలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చోరీకి గురైన వాటిని రికవరీ అయ్యేలా చర్యలు చేపట్టి బాధిత రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో ఈనెల 17 నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల విద్యాధికారి ఓబులేసు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 363 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలు సింహాద్రిపురంలోని నూతన జిల్లా పరిషత్ హైస్కూల్, నిడివెలగల సమీపంలోని కస్తూరిబా పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నామని ఎంఇఒ వివరించారు.

ప్యానెల్ చైర్మన్ హోదా దక్కడం హర్షణీయం

ప్రజాశక్తి - చాపాడు

శాసనమండలి ఛైర్మన్ అందుబాటులో లేని కారణంగా శాసన మండలి ప్యానెల్ ఛైర్మన్‌గా రమేష్ యాదవ్ సమర్థవంతంగా నిర్వహించారు. ఈ అవకాశం దక్కడం కడప జిల్లా కీర్తికి, గౌరవానికి నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. శాసనమండలి స్పీకర్‌గా దక్కిన అవకాశాన్ని రమేష్ యాదవ్ సమర్థవంతంగా నిర్వహించి పలువురు ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా తవ్వా వెంకటయ్య రమేష్ యాదవ్‌కు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో శాసనమండలి సభ్యులుగా మరింత సమర్థవంతంగా పనిచేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కడప జిల్లా కీర్తిని గౌరవాన్ని కొనసాగించే రాజ్యాంగ పదవి ఏదైనా ఉన్నతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఆప్తమాలిక్ అధికారి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో కస్తూరిబా బాలికల పాఠశాలలో 30 మంది విద్యార్థులకు కళ్ల అద్దాలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ పోషక ఆహారంతోపాటు పండ్లు, ఆకుకూరలు బాగా తీసుకుంటూ కంటి చూపును కాపాడుకోవాలన్నారు. 40 ఏళ్లు దాటిన వారు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా కంటి పరీక్ష చేయించుకోవాలని కోరారు. తదుపరి ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగలక్ష్మి, సూపర్వైజర్ సరస్వతి, ఎఎన్ఎం విజయకుమారి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

మహిళపై కత్తితో దాడి

- సరుదు లాక్కెళ్లిన దుండగుడు, పోలీసుల గాలింపు

ప్రజాశక్తి - కమలాపురం టౌన్

కమలాపురం నగర పంచాయతీ గిడ్డింగ్ వీధిలో నివాసం ఉంటున్న కరంగూడి లక్ష్మీదేవిపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేసి బంగారు సరుడు తీసుకెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. గురువారం ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లో దూరి కంట్లో కారం పొడి చల్లి గొంతు కోసి, పది తులాల బంగారు సరుడు తీసుకెళ్లాడు. మహిళపై ముక్కు, మెడ తదితర చోట్ల కత్తితో గాయపడిచాడు. తీవ్ర రక్త స్రావంతో పడి ఉన్న బాధితురాలిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బాధితురాలు మాట్లాడుతూ తమ పక్కింటి ఆకుల నవీన్ బంగారు కావాలి ఇస్తే ఏమీ చేయను.. ఇవ్వకపోతే చంపేస్తానంటూ బెదిరించాడని పేర్కొంది. లక్ష్మీదేవి భర్త శేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శేఖర్‌రెడ్డి కమలాపురం నగర పంచాయితీ కార్యాలయంలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు.

కనిపించని చెరుకు సాగు

ఒకసారి పంట సాగు చేస్తే మూడేళ్లు దిగుబడి - రైతులకు అందని ప్రోత్సాహం



చెరుకు పంట

ప్రజాశక్తి - చాపాడు

చెరుకు పంట సాగు రెండేళ్లుగా కనిపించడంలేదు. రైతులు ఆసక్తి చూపడం లేదు. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా చెరుకు సాగుకు గతంలో కంటే ఆసక్తి పూర్తిగా తగ్గింది. ముఖ్యంగా చాపాడు, ఖాజీపేట మండలాల్లో రైతులు చెరుకు సాగును చేపట్టేవారు. రెండేళ్లుగా సాగుకు విరామం ప్రకటించారు. కొంతకాలంగా రైతులకు ప్రోత్సాహకం అందడం లేదనేది రైతుల అభిప్రాయం. నెల్లూరు జిల్లా పొదలకూరులోని మయూర చెక్కర ఫ్యాక్టరీ వారు సాగుకు అవసరమైన విత్తన చెరకును గతంలో ఉచితంగా సరఫరా చేసేవారు. రవాణా ఖర్చులతో టన్ను రూ.3వేలకు కొనుగోలు చేసేవారు. తర్వాత విత్తన చెరుకు సరఫరా చేయకపోవడంతో ఎకరాకు రూ.7వేలు విలువ చేసే 3టన్నుల చెరుకు ఫించెలను రైతులు కొనుగోలు చేసుకొని సాగు చేపట్టేవారు. ఫ్యాక్టరీ వారు రైతులకు బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. ఈ బకాయిల కోసం నానా అవస్థలు పడ్డారు. దీంతో సాగుకు విరామం ప్రకటించారు. చెరుకు పంటను ఒక ఏడాది సాగు చేస్తే మూడేళ్లపాటు దిగుబడి వస్తుంది. చెరుకు ముచ్చలను (గడెలు) కూలీలు కొద్దిగా పైభాగంలో నరకడం వల్ల ఆ పించ (కన్ను) మళ్లీ విత్తనంగా మారుతుంది. తద్వారా ఒకసారి సాగు చేసిన పంటను మూడు దఫాలు ఉపయోగపడుతుందని రైతులు పేర్కొం టున్నారు. చాపాడు మండలంలో రాజువారిపేట, అయ్యావారిపల్లె, తిమ్మాయపల్లె, నక్కలదిన్నె, పల్లవోలు గ్రామాల పరిధిలో గతంలో 500 ఎకరాల్లో చెరుకు సాగు చేపట్టేవారు. ఖాజీపేట మండల పరిధిలో చెన్నముక్కపల్లె, కొత్తపేట, దుంపలగట్టు, ములపాక తదితర గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో సాగు చేపట్టేవారు. దువ్వూరు మండలం, మైదుకూరులో 100 ఎకరాల వరకు సాగు చేపట్టేవారు. ఫ్యాక్టరీ వారు విత్తనం ఉచితంగా సరఫరా చేసే సందర్భంలో దిగుబడి రాగానే పొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేయడంతో రైతులకు చాలా వరకు ఇబ్బందులు తొలిగేవి. గతంలో చెన్నూరు చెక్కర ఫ్యాక్టరీ అందుబాటులో ఉన్నప్పుడు చాపాడు, ఖాజీపేట మండలాల పరిధిలోనే రెండువేల ఎకరాలలో సాగు చేపట్టేవారు. ప్రజాప్రతినిధులు చెరుకు సాగును ప్రోత్సహించేందుకు సహకారం అందిం చేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.



చెరుకు విత్తనం

అజ్ఞాతంలో వ్యాపారులు.. రుణదాతలు బెంబేలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేటలో దివాలా కోరు సంఘటనలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయి. ప్రజలకు అధిక వడ్డీలను ఆశ చూపుతూ అందిన కాడికి దోచుకుంటున్నారు. చే బదులు, వడ్డీల కంటూ తీసుకొని సొమ్మును వెనకేసుకుంటూ రుణ దాతలకు అన్యాయం చేస్తున్నారు. దివాలా తీయడం.. నాయకులను ఆశ్రయించడం పరిపాటి అయింది. నష్టాలు వచ్చాయంటూ పంచాయితీలు పెట్టడం, సగానికి సగం సొమ్మును చెల్లిస్తూ దర్జాగా ఉండిపోతున్నారు. కొంతకాలంగా ఇలాంటి ఘటనలు జిల్లాలో ఎక్కడా చోటు చేసుకోని విధంగా ఖాజీపేటలో జరుగుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. రెండు రోజుల క్రితం ఓ కిరాణా దుకాణం యజమాని అందరి వద్ద నమ్మకంగా అధిక వడ్డీలు ఆశ చూపి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుని పరారయ్యాడు. విషయం తెలిసిన రుణదాతలు లబోదిబోమంటూ దుకాణం వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. ఈ ఘటన మరువకముందే ఇంకో పెద్ద పేరు మోసిన వ్యాపారి ఒకరు కోట్లాది రూపాయలు ప్రజల నుంచి వసూలు చేసి పరారీలో ఉన్నట్లు ప్రజలు గుసగుసలాడుచున్నారు. తాము కష్టపడి సంపాదించుకున్న సొమ్మును అవసరానికి ఇస్తే ఎగ్గొట్టడం ఎంతవరకు సబబని బాధితులు వాపోతున్నారు. పంచాయితీలు చేసే నాయకులు కూడా ఈ విషయంలో ఆలోచించాలని రుణ దాతలు కోరుతున్నారు. ఇలాంటి సంఘటనలు అధికంగా చోటు చేసుకుంటున్నా ఎవరూ బాధితులకు న్యాయం చేయడం లేదు. పైగా బాధితులనే వడ్డీలకు ఆశపడి ఇవ్వడం మీ తప్పు అంటూ సొమ్మిచ్చిన వాళ్లని తప్పు పడుతున్నారని, ఎగ్గొట్టే వాళ్లను వెనకేసుకొస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. గతంలో ఓ ఫర్టిలైజర్ దుకాణ యజమాని కోట్ల రూపాయలు ఎగ్గొట్టినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇలాంటివాటిపై కఠినంగా వ్యవహరిస్తే పునరావృతం కావని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు రుణదాతలకు మద్దతుగా నిలిచి న్యాయం చేయకపోతే ప్రజల దృష్టిలో విలువలు కోల్పోవాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

నర్సింగ్‌కు సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైద్యంలో నర్సులది ప్రత్యేకమైన పాత్ర అని, సమాజంలో విలువైనదని సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు పేర్కొన్నారు. ఫ్రెషర్స్ డే 2К25ను శ్రీసాయి రాజేశ్వరి నర్సింగ్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రామాంజనమ్మ తెలిపారు. ముఖ్యఅతిథిగా మెడికల్ సూపరింటెండెంట్ అఫ్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ డాక్టర్ ఆనంద్‌బాబు, గౌరవ అతిథులుగా చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాడెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, ఎస్ఆర్ఐటి ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి పాల్గొన్నారు. ప్రిన్సిపల్ రామాంజనమ్మ మాట్లాడుతూ కొత్తగా కళాశాలలో ప్రవేశించిన విద్యార్థులకు స్వాగతం పలికారు. కళాశాల వాతావరణాన్ని పరిచయం చేశారు. డాక్టర్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ నేటి నుంచి మీరు మీ జీవితంలో కొత్త ప్రయాణం ప్రారంభించపోతున్నారని తెలిపారు. చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ జాతి, కులం, మతం లేకుండా గౌరవించేది ఒక్క వైద్యసేవలోనే అన్నారు. వీరకల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ నర్సింగ్ కోర్సును పూర్తి చేసుకుని కేవలం ధనార్జనకు కాకుండా సమాజ సేవకు మీ వంతు కృషి చేయాలన్నారు. అనంతరం ఎస్ఆర్ఐటి ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ సీనియర్లకు గౌరవం ఇచ్చి సోదర భావం కలిగి, నాలుగేళ్ల కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. సీనియర్లు జూనియర్లకు కోర్సుకు సంబంధించిన సందేహాలను, అభిప్రాయాలను ఒకరికొకరు పంచుకున్నారు. విద్యార్థులు పాటలు, నృత్యాలతో సందడి చేశారు. నర్సింగ్ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌సి స్థానికంగానే చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నడిపే ప్రతి ఆటోకు ఎఫ్‌సి ప్రొద్దుటూరు ఆర్‌టిఒ కార్యాలయంలోనే చేసేలా చూసి, ఆటో కార్మికులకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. ఆటోలు ఎఫ్‌సి చేయించుకోవాలంటే ప్రొద్దుటూరులో చేయడం లేదని, కడపలో చేయించుకోవాలని అధికారులు తెలపడం అన్యాయం అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రొద్దుటూరులో ఆర్‌టిఒ కార్యాలయానికి ఐదు ఎకరాల స్థలం తీసి, అక్కడ నలుగురు ఇన్‌స్పెక్టర్లు, ఒక ఆర్‌టిఒ విధులు నిర్వహించేలా గతంలో ప్రయత్నించామన్నారు. కొంతకాలం వరకు ప్రొద్దుటూరులోనే ఎఫ్‌సి ఇచ్చేవారు.. కానీ ప్రస్తుతం కడపలో చేయించుకోవాలని చెప్పడం ఆటో కార్మికులకు అన్యాయం చేయడమేనని సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో దాదాపు ఎనిమిది వేల ఆటోలు ఉన్నాయన్నారు. చాలామంది నిరుద్యోగులు, ఉపాధి దొరక్క ఆటోలతో జీవనం గడుపుతున్నారని తెలిపారు. వీరు ఎఫ్‌సి నిమిత్తం ఏడాదికోసారి కడపకు వెళ్లాలంటే వ్యయప్రయాసలతో కూడుకున్నదన్నారు. ఆటోకు ఏ చిన్న రిమార్కు వచ్చిన బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు ఎఫ్‌సి చేయకుండా తిరస్కరిస్తుంటారని తెలిపారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో చర్చించి ఏ నియోజకవర్గానికి ఆ నియోజకవర్గంలోనే ఎఫ్‌సి మంజూరు చేసేలా చూడాలని సూచించారు. లేనిచో ఆటో కార్మికులతో ఆర్‌టిఒ కార్యాలయాలను ముట్టడిస్తామని సత్యనారాయణ హెచ్చరించారు. సమావేశంలో ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, ఓబయ్య, చంద్రారెడ్డి,ఆటో కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సత్యనారాయణ



ఎంపీ అవినాష్‌రెడ్డికి సమస్యల్ని వివరిస్తున్న నాయకులు

ఎంపీకి సమస్యలపై వినతిపత్రం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలో నెలకొన్న సమస్యలపై వైసిపి నాయకులు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆ మేరకు వారు గురువారం ఎంపీకి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని కాశిరెడ్డి నాయన క్షేత్రంలో కట్టడాల కూల్చివేత ఘటనను పరిశీలించడానికి ఎంపీ ఖాజీపేట మీదుగా వెళుతుండగా వైసిపి నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా నాయకులు పలు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో కెసి కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ డిఎల్ శ్రీనివాస్‌రెడ్డి, వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ పీవీ రాఘవరెడ్డి, ఆ పార్టీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, వైసిపి మైదుకూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి, తవ్వారుపల్లె అమరేశ్వర్‌రెడ్డి, ఏటూరుకు చెందిన అంబటి శివారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థి తండ్రి శౌలు రాజుకు నగదు అందజేస్తున్న ఎఒ రవికుమార్

విద్యార్థికి హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్ చేయూత

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో సిఎస్‌సి విభాగంలో రెండవ సంవత్సరం చదువుతున్న సురేంద్ర అనే విద్యార్థి ఆరోగ్యం కోసం విద్యార్థి తండ్రి శౌలు రాజుకు ఎఒ డాక్టర్ రవికుమార్ చేతుల మీదుగా రూ.6,02,226 లక్షలు అందజేశారు. పోరుమామిళ్ల ప్రాంతానికి చెందిన సురేంద్ర ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. సురేంద్రకు కేన్సర్ వ్యాధితో వేలూరు సిఎంసి హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. విద్యార్థి తండ్రి నిరుపేద రైతు కావడంతో తన కొడుకును కాపాడుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు. ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లోని హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ విద్యార్థులు, ఉపాధ్యాయులు సహాయంతో రూ.5,02,226, ఇతర క్యాంపస్‌ల నుండి దాదాపు రూ.1లక్ష సేకరించారు. ఈ మొత్తాన్ని విద్యార్థి తండ్రి శౌలు రాజుకు గురువారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో అందజేశారు. దాతలు విద్యార్థి సురేంద్రకు సహకరించి ప్రాణాలు కాపాడాలని ఎఒ కోరారు. కార్యక్రమంలో డీన్ అకాడమిక్స్ డాక్టర్ రమేష్ బాబు, కైలాస్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ వెంకటేష్, హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ విద్యార్థులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫా అందిస్తున్న ఎస్ఐ యోగేంద్ర

పేదలకు రంజాన్ తోఫా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా విభిన్నప్రతిభావంతుల సేవ సమితి ఆధ్వర్యంలో రంజాన్ మాసం పురస్కరించుకొని గురువారం మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో 30 కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా త్రీటౌన్ ఎస్ఐ యోగేంద్ర మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిరుపేద ముస్లిం ఏ ఒక్కరూ డబ్బు లేని కారణంగా ఈ వేడుకకు దూరం కాకూడదని గొప్ప మనసుతో విభిన్నప్రతిభావంతుల కుటుంబాలకు చేయూత నివ్వడం చాలా గొప్ప విషయమన్నారు. మదర్ థెరిస్సా విభిన్నప్రతిభావంతుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ రంజాన్ మాసం లో నిత్యావసర సరుకులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎవరైనా దాతలు ఉంటే వీరిని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో షేక్ అల్తాఫ్, ఆసిఫ్, ఖాదర్, ఎద్దు సుబ్బరాయుడు, జ్యోతి, వెంకటలక్ష్మి, గురు ప్రసాద్, వెంకటసుబ్బయ్య, భద్రుడు, కేశవలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

విద్యుత్ లైన్ల మెయింటనెన్స్ వల్ల శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ ప్రియదర్శన్‌రెడ్డి తెలిపారు. ముద్దనూరు రోడ్డు, కడప రోడ్డు, వేంపల్లి రోడ్డు, రాణివనం, వినాయక నగర్, సుందరయ్య నగర్, ప్రొద్దుటూరు రోడ్డు, ఎస్టేట్ ఏరియాలో ఉదయం 8:30గంటల నుండి 11:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ తీగ లపై పెరిగిన చెట్లను తొలగించడం, లూజ్ కనెక్షన్లను సరి చేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సిబ్బం దికి సహకరించాలని ఎఇ కోరారు.

మాదక ద్రవ్యాల వాడకం.. ఆరోగ్యానికి హానికరం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ ఎల్ జోజిరెడ్డి

మాదక ద్రవ్యాల వాడకం ఆరోగ్యానికి హానికరమని డాక్టర్ వైజి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో గురువారం 'మాదకద్రవ్యాల వ్యతిరేకత–సమాజంలో దాని ప్రభావం'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధ్భంగా డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మెరుగైన జీవితాన్ని ఎలా గడపాలి అనే దానిపై లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎల్ జోజిరెడ్డి వివరిం చారు. మాదకద్రవ్యాలను వాడడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ విష్ణు నారా యణ విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాం డెంట్ డాక్టర్ ఆంటోనీ స్వామి, అధ్యాపకులు, ఈగేలె క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మత్తు మందులు అమ్మకూడదు


- వైద్యులు, మెడికల్ షాపుల యజమానులతో సిఐ దస్తగిరి

ప్రజాశక్తి - ముద్దనూరు

మెడికల్ షాపుల్లో ప్రజలకు మత్తు మందులు అమ్మకూడదని సిఐ దస్తగిరి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో గురువారం సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ వైద్యులు, ఆర్ఎంపి, మెడికల్ షాపు యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యుల ప్రెస్కిప్షన్‌లో ఉన్న మందులు మత్రమే విక్రయించాలన్నారు. అనుమతి లేకుండా వైద్యులు, ఆర్ఎంపిలు, మెడికల్ షాపు వారు ప్రజలకు మత్తు మందులు అమ్మకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ వి.వరప్రసాద్

ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ కోరారు. ప్లాస్టిక్ నిషేధంపై గురువారం మున్సిపల్ కమిషనర్ డి.రాముడు, మున్సిపల్ చైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పులివెందుల పురపాలక సంఘం పరిధిలోని హోల్‌సేల్, రిటైల్ కిరాణా షాపు యజమానులతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ వాడడం వల్ల మానవాళి మనుగడకు కలిగే దుష్ప్రభావాలు, పర్యావరణంపై ప్రభావం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కిరాణా షాపు యజమానులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

ఎఫ్ఎసి హెచ్‌ఎంగా శ్రీనివాసులు

ప్రజాశక్తి - వేంపల్లె



స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు ఎఫ్ఎసి హెచ్‌ఎంగా చెరుకూరి శ్రీనివాసులును నియమిస్తూ ఆర్‌జెడి శామ్యూల్ ఆదేశాలు జారీ చేశారు. ఇటివల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులపై అదే పాఠశాలలో పని చేస్తున్న పిజిటి ఉపాధ్యాయుడు దాడి చేస్తున్న సమయంలో హెచ్‌ఎం నారాయణమ్మ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని అధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో బాలికల పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ అయిన పిజిటి ఉపాధ్యాయుడు చెరుకూరి శ్రీనివాసులును ఎఫ్ఎసి హెచ్‌ఎంగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్ : కేన్సర్ బాధితులకు ఉచితంగా విగ్గులను అందజేసేందుకు హెయిర్ ఫర్ హోప్ ఇండియా వారి సహకారంతో జెబివిఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ వివేకానంద మహిళ డిగ్రీ కళాశాలలో కేశాలు దానం, కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ కేన్సర్ ఏవిధంగా వస్తుంది.. ఎలా నిర్మూలించాలనే అంశంపై అవగాహన కల్పించారు. కేన్సర్ బాధితులు ం కీమోథెరపీ ద్వారా చికిత్స పొందుతున్నప్పుడు తమ కేశాలు ఊడిపోయి నిరాశ చెందుతారని, ఈ కేశాలు దానంచేసే కార్యక్రమం ద్వారా కొంత మందికైనా విగ్గులు అందజేయొచ్చని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ డిఎస్ఆర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కేన్సర్‌తో పోరాడుతున్న వారికి తమ వంతు సహాయం చేయాలనే సంకల్పంతో కార్యక్రమం నిర్వహించిన జెవిబిఎస్ సంస్థకు అభినందనలు తెలిపారు. సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ తమ కేశాలను దానం చేసి కేన్సర్ చికిత్స పొందుతున్న రోగులకు శారీరక, మానసిక ధైర్యాన్ని పెంచేలా ముందుకొచ్చిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.